అక్రమ తారు ప్లాంట్‌కు నోటీసులు

విశాలాంధ్రలో కథనంతో స్పందించిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అడిగేవాడు లేడని.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ.. నిబంధనలను ఉల్లంఘించి గ్రామ స్థాయి రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని సంతృప్తిపరిచి దళారులు ఇచ్చిన ధైర్యంతో అక్రమ తారు ప్లాంట్ ఏర్పాటు చేసిన వైనంపై విశాలాంధ్రలో వచ్చిన కథనంతో కాలుష్య నియంత్ర మండలి అధికారులు స్పందించారు. ప్లాంటును పరిశీలించి ఎటువంటి అనుమతులు లేవని ధ్రువీకరించి నోటీసులు అందజేసిన సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సబ్బవరం మండలం బాట జంగాలపలెం రెవెన్యూ పరిధిలో అనకాపల్లి మండలం చేనుల అగ్రహారం సమీపంలో సర్వేనెంబర్ 195లో అక్రమ తారు ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న వైనంపై ఈనెల 10న "అనుమతులు లేకుండా తార్ ప్లాంట్" అనే కథనం విశాలాంధ్రలో వచ్చింది. దీనికి స్పందించిన జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సంబంధిత ఏఈని సదరు ప్లాంట్ పరిశీలనకు పంపగా ఎటువంటి అనుమతులు లేవని ధ్రువీకరించారు. అనుమతులు తీసుకునే వరకు ప్లాంట్ నిర్వహణ చేపడితే చర్యలు తీసుకుంటామంటూ నోటీసులు జారీ చేశారు. అన్ని

అనుమతులతోనే ప్లాంట్ ఏర్పాటు చేశామని గ్రామస్థాయిలో ప్రచారం చేసుకున్న యాజమాన్యం అధికారులు నోటీసు ఇవ్వడంతో పంచాయతీలో అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్నామని ఇంకా రాలేదని చెప్పడం విడ్డూరంగా ఉంది. అనుమతులు రాకపోతే ప్లాంట్ ఎందుకు, ఎలా నడిపారు అనే విషయంపై సదరు ప్లాంట్ యాజమాన్యం నోరు విప్పలేదు. పంచాయతీ అనుమతులు తీసుకుంటే సరిపోతుందా...? రెవెన్యూ పరంగా ల్యాండ్ కన్వర్షన్ చేసుకోరా...? పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు అవసరం లేదా...? బాటజంగాలపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్నప్పటికీ ప్లాంట్ ద్వారా వచ్చే కాలుష్యంతో సమీపంలో ఉన్న చేనుల అగ్రహారం గ్రామం కలుషితం అవుతుంది కదా.. ఆ గ్రామంలో గ్రామ సభ అవసరం లేదా...? అనే సందేహాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి. అనుమతులు ఉన్నాయనే తప్పుడు ప్రచారంతో గ్రామస్తులను నమ్మించే ప్రయత్నం చేసిన తారు ప్లాంట్ యాజమాన్యంపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు కూడా స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి: అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలని, రాష్ట్ర అభివృద్ధిలో పాలు పంచుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. పాయకరావుపేట నియోజకవర్గ స్థాయి అధికారులతో పాయకరావుపేట అతిథి గృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ హోం మంత్రి ఉండే నియోజకవర్గంలో అధికారులు పని చేయటం అదృష్టమో, దురదృష్టమో అధికారులు తేల్చుకోవాలన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, పరిష్కారం లేని సమస్య ఉండదని, ఒక అధికారికి ఒక సమస్య చెప్పినప్పుడు పరిష్కారం కాదు అనే సమాధానం వారి నుండి రాకూడదన్నారు. పాయ కరావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అధికారులు సహకరిం చాలని మంత్రి అనిత కోరారు. పాయకరావుపేట నుంచి పక్షాళన ప్రారంభిస్తారని, అక్రమ లేఅవుట్లు, నిబంధనలకు విరుద్ధంగా చెరువుల తవ్వకాలు, భూములు ఆక్రమణ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని తన పేరు చెప్పుకొని డబ్బులు వసూలు చేసే వారిని ఉపేక్షించరాదన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో నియోజక వర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టా రాజ్యంగా ఫీజు వసూలు చేస్తూ పాఠ్య పుస్తకాలు యూనిఫామ్ పేరుతో అదనంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద బొడ్డేపల్లి స్టార్ హెూమ్స్ వద్ద ఉన్న భాష్యం పాఠశాలలో అమ్ముతున్న పాఠ్య పుస్తకాలను బయటకు తీసుకొచ్చి ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ నాగేంద్ర వచ్చి బుక్స్‌ని సీజ్ చేశారు. అనంతరం నర్సీపట్నంలో ఉన్న శ్రీ విద్యాంజలి పాఠశాలను కూడా తనిఖీ చేసి రిపోర్ట్‌ని జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజు వసూలు చేస్తున్న జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఈ రకంగా విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాలు యూనిఫాంలో విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి తక్షణమే పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయిస్తున్న పాఠశా లలపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వ నిబంధన పాటించకుండా పాఠశాలలు నిర్వహిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి, జి.ఫణీంద్ర కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు రాధాకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, రవి, తాతాజీ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

కవర్డు, హైటర్ సమాధుల స్థలం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రలో సాక్ష్యంగా నిలిచిన బ్రిటిష్ సేనానులు కవర్డు, హైటర్ సమాధుల స్థలం ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవ స్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఆర్డీఓను కోరుతూ మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పురావస్తు శాఖకు చెందిన, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించవలసిన అవసరం ఉందని, ఈ స్థలాన్ని కొంతమంది ఆక్రమణలు చేసిన, చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని అన్యాక్రాంతం కాకుండా చూడాలని 11 మార్చి 2024న ఆర్డీఓ స్పందనలో లేఖను ఇవ్వడం జరిగిందని, దీనిపై ఆర్డీఓ చొరవ తీసుకుని ఆక్రమణలు తొలగింపునకు మున్సిపల్ అధికారులకు ఆదేశాలను జారీచేయగా వారు చర్యలు తీసుకొని ఆక్రమణలో ఉన్న వాటిని తొలగించడం జరిగిందని, అందుకు ఆర్డీఓకు పడాల వీరభద్రరావు ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పుడు మరలా కొంతమంది ఆక్రమించడానికి చూస్తున్నారని, ఆ స్థలంలో ఈ స్థలం మా సంఘానికి చెందినదని కొత్తగా బ్యానర్లు కట్టడం జరిగిందని, అంతేకాకుండా నిర్మాణాలు కూడా చేస్తామని హెచ్చరించారని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకొని చుట్టూ ఐరన్ కంచెను ఏర్పాటు చేసి, స్థలంలో ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని, ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం తరఫున ప్రహరీ నిర్మాణానికి జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘానికి అవకాశం ఇచ్చినట్లయితే తమ సంఘం సొంత నిధులతో ప్రహరీ నిర్మించగలమని చారిత్రాత్మకమైన ఈ స్థలాన్ని పరిరక్షించి, అభివృద్ధి చేయాలని కోరుతూ పడాల వీరభద్రరావు ఆర్డీఓకు ఒక లేఖను అందజేశారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - యలమంచిలి: మండలంలోని కొక్కిరాపల్లి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగుల సీట్లు భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం తెలిపారు. 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన 6, 7, 8, 9 తరగతులలో ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుగా చెప్పారు. ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలు నుండి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్ జతచేస్తూ దరఖాస్తు చేయాలని సూచించారు. 28వ తేదీ ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆరవ తరగతి ఎస్సీ 17, ఏడో తరగతి ఎస్సీ 3, బిసి 1, ఎనిమిదో తరగతి ఎస్సీ 7, ఎస్టీ 1, తొమ్మిదో తరగతిలో ఎస్సీ 5, ఎస్టి 1 ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బుడడుపాడు గ్రామంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - గొలుగొండ. మండలంలో పాత మల్లంపేట పంచాయతీ పరిధిలో గల శివారు గ్రామమైన బుడ్డడుపాడు గ్రామంలో గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్యాం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుడ్డడుపాడు గ్రామంలో పలువురు టైఫాయిడ్, మలేరియా వంటి జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ నర్సీపట్నం కృష్ణదేవిపేట ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిం చుకుంటున్నారని వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన గొలుగొండ వైద్యాధికారులు మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉన్న రోగులందరిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ ఇళ్ల వద్ద పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలా అయితే దోమలు, ఇతర కీటకాలు వంటివి రాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు.

హోం మంత్రి అనితకు సన్మానం

విశాలాంధ్ర - పాయకరావుపేట: హెూం మినిస్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి విచ్చేసిన వంగలపూడి అనితను ఆమె నివాసంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల సచివాలయం మహిళా పోలీసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెూం మినిస్టర్ అనితకు మహిళా పోలీసులు పుష్పగుచ్ఛం అందించి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు తోట చరిష్మా, ఆదిలక్ష్మి, భవాని, గవ్వా రేవతి తదితరులు పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర - గొలుగొండ: ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతానికి అక్రమంగా గంజాయి తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు మండలంలో సీతకండి గ్రామ శివారులో వాహనాలను పోలీసులు తనిఖీలు చేశారు. బైక్‌పై నాలుగు కేజీల గంజాయితో వస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని గొలుగొండ ఎస్సై కృష్ణారావు తెలిపారు. చింతపల్లి వైపు నుండి నర్సీపట్నం వైపు వస్తున్న బైక్ ఏపీ 07 డి జెడ్ 8012పై ఇద్దరు వ్యక్తులు గోని సంచిలో నాలుగు కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. అనంతరం నిందితుల వద్ద నుండి రెండు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

షిరిడి సాయి ఆలయ 26వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని బృందావనం దుర్గాలమ్మ చెట్టు వద్ద ఉన్న షిరిడి సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా కాకడ హారతి, వివిధ ఫల రసాలు, పంచామృతాలతో అభిషేకం, వివిధ నదుల నుంచి తెచ్చిన జలాలతో కూడిన 108 కళాశాలతో సాయిబాబా ఊరేగింపు, సహస్ర దీప అలంకరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయిబాబా భక్తులు, సేవకులు వేడుకల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

భవిత కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలంధ్ర - అచ్యుతాపురం: దివ్యాంగులు భవిత కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్వ శిక్ష అభియాన్ కోఆర్డినేటర్ శకుంతల అన్నారు. మంగళవారం స్థానిక భవితా కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఎన్రోల్మెంట్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రంలో ఇద్దరూ ప్రత్యేక ఉపాధ్యాయులు ఒక ఫిజియోథెరపిస్ట్ అందుబాటులో ఉండి దివ్యాంగులకు సేవలు అందిస్తారని తెలిపారు. దివ్యాంగ పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్ రవాణా చార్జీలు ప్రత్యేక అలవెన్సులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. వారంలో ఐదు రోజులు భవిత కేంద్రాలు పనిచేస్తాయని ఒకరోజు ఫిజియోథెరపిస్ట్ అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి శనివారం ప్రత్యేక ఉపాధ్యాయులు తీవ్రవైకల్యం గల దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తారని దివ్యాంగులందరినీ విధిగా పాఠశాలలో చేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు జగదాంబ, శైలజలు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో చేపలు మృత్యువాత

విశాలాంధ్ర - పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి ఉప్పుటేరులో మంగళవారం సముద్ర చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకు వచ్చాయి. దీంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఫార్మా కర్మాగారాల నుంచి వెలువడిన కాలుష్య కారక వ్యర్థాలు ఉప్పుటేరు నీటిలో కలవడం వల్లే చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు అంటున్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఉప్పుటేరులో కూడా మత్స్యకారులు చేపల వేట సాగిస్తారు. కలుషితం కారణంగా చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకురాగా పెద్దసైజు చేపలు గిలగిలా కొట్టుకుంటూ చనిపోయి నీటిలో తేలుతున్నాయి. వీటిని చూసి నీటిలో దిగడానికే మత్స్యకారులు భయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచులు చింతకాయల సుజాత ముత్యాలు, చేపల మసేను తదితరులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎన్డీఏ నాయకులు పంచకర్ల ప్రసాద్, పైల జగన్నాధరావు, మాసవరపు అప్పలనాయుడు, సిరిపురపు అప్పలనాయుడు, వియ్యపు చిన్న, మోటూరు సన్యాసినాయుడు, బుగిడి రామగోవిందరావు, నగిరెడ్డి చిన్నారావు తదితరులు ఉప్పుటేరు వద్ద మృతి చెందిన చేపలను పరిశీలించారు. అనంతరం మృతి చెందిన చేపలను చూపిస్తూ నిరసనకు దిగారు.

ఫార్మా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ఫార్మా వ్యర్థ రసాయనాలు కలవడం వల్లనే ఉప్పుటేరులోని చేపలు మృత్యువాత పడ్డాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ జరిపించి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సముద్ర జలాలు ఫార్మా పరిశ్రమల కాలుష్యానికి గురవుతున్నట్లు ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసినట్లు గనిశెట్టి తెలిపారు. ఒకవైపు కేసు నడుస్తున్నప్పటికీ స్థానిక ఫార్మా పరిశ్రమలు శుద్ధిచేయని రసాయనిక వ్యర్థ జలాలను నేరుగా విడిచి పెట్టడంతో మత్స్య సంపద నాశన మవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పీసీబీ, రెవెన్యూ, మత్స్యశాఖాధికారులు విచారణ చేసి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

జువాలజీ అధ్యాపకురాలికి డాక్టరేట్

విశాలాంధ్ర - యలమంచిలి: ఎస్.జి.ఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ అధ్యాపకురాలిగా పని చేస్తున్న కె.సుజాతకి ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈమె మిష్టస్ గుడియో చేప ప్రత్యేకతగా ఆంధ్రప్రదేశ్ మహేంద్ర తనయ నదిలో ఉండి మత్స్య వైవిధ్యతపై చేసిన పరిశోధనకు గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఇందుకు గాను కళాశాల ప్రిన్సిపాల్ డా. చంద్ర శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.రామారావు, ఫిజికల్ డైరెక్టర్ డా.వై. పోలిరెడ్డి, కళాశాల సిబ్బంది అభినందించారు.

సామూహిక లక్ష్మీ గణపతి హోమం

విశాలాంధ్ర - చోడవరం: ఆంధ్ర రాష్ట్రంలో చరిత్ర ప్రసిద్ధి చెంది, అత్యంత మహిమా న్వితమైన స్వయంభూ దేవాలయాల అన్నింటిలో ఒక్కటైన అనకావల్లి జిల్లా చోడవరం స్వయం భూ విఘ్నేశ్వర ఆలయంలో భక్తులచే మంగళవారం సామూహిక లక్ష్మీ గణపతి హెూమం నిర్వహించారు. వేకువ జామునే పురుష సూక్త విధానంలో పంచామృతంలతోను, క్షీరాది, ఫలోదక, జలాది అభిషేకములు అనంతరం గరిక పూస అలంకారములతో కార్యసిద్ధి గణపతి ని శాస్త్రోక్తంగా ఆలయ ప్రధాన అర్చకులు కొడ మంచలి షణ్ముఖ శాస్త్రి (శ్రీనివాస్) ప్రత్యేక అర్చన నిర్వహించారు. అనంతరం అంగారక సంకష్ట హర చతుర్థి సందర్భంగా భక్తులచే సామూహికంగా శ్రీ లక్ష్మీ గణపతి హెూమం జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కొడమంచలి షణ్ముఖ శాస్త్రి (శ్రీనివాస్), ఈ.ఓ. ఎస్.వి.వి.సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - కశింకోట: విశాఖ నుండి విజయవాడ మీదగా వెళ్తున్న రైళ్లను తక్షణమే పునరుద్ధరించి సామాన్యులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని సీపీఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు, వలస కార్మికులు ప్రతి రోజు వేలాది మంది ప్రయాణిస్తున్నారని, వీరికి అందుబాటులో వుండే రైల్వే సర్వీసులను రద్దు చేయడం వలన తీవ్రమైన ఆర్థిక భారంతో పాటు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గతంలో సామాన్య ప్రజలు రైల్వే జనరల్ బోగీలలో ప్రయాణించేవారని, ఆ బోగీలను ప్రభుత్వం తగ్గించిందని, తరువాత కాలంలో సాధారణమైన వారికి అందుబాటులో వుండే స్లీపర్ బోగీల సంఖ్య తగ్గించి ఎసి బోగీలను పెంచడం ద్వారా సామాన్యుల ప్రయాణ సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం దూరం చేసిందన్నారు. తాజాగా ఆధునీకరణ పేరుతో విశాఖ నుండి విజయవాడ వెళ్ళే ప్యాసింజర్ రైళ్లతో పాటు సింహాద్రి, రత్నాచల్, ఉదయ్, మచిలీపట్నం, గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌లను తరుచు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, ఇతర రవాణా వాహనాల కంటే రైల్వేలో అతి తక్కువ ఛార్జీలు వుండడంతో పేద, మధ్య తరగతి వర్గాల వారు తమ ప్రయాణాలకు రైల్వేనే ఎంచుకుంటారని, అటువంటి రైళ్లను రద్దు చేయడం వల్ల రోజుకు 10వేల మందికి పైగా ప్రయాణికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. విశాఖ నుండి విజయవాడ సుదూర ప్రాంతాల్లో తిరిగే రైళ్లు రద్దు నిర్ణయం తీసుకోవడం ఏమాత్రం మంచిదికాదన్నారు. ఆధునీకరణ పనుల పేరుతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలతో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన రైల్వే అధికారులు, ఇలా రైళ్లను నిలుపుదల చేయడమంటే ఉద్దేశ్యపూర్వకంగానే ప్రజలను రైలు ప్రయాణం నుంచి దూరం చేయాలని చూస్తున్నారని అర్థమౌతుందన్నారు. రైలు ప్రయాణం పట్ల ఆశక్తి తగ్గించి క్రమంగా రైళ్లను ప్రైవేటీకరించాలన్న కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాల్లో భాగంగానే రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్లు భావిస్తున్నామన్నారు. సాధారణ ప్రయాణికుల సాదక, బాధలను అర్థం చేసుకొని అందుకు అనుగుణంగా రైళ్లను నడపాలన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రం అయిన తరువాత నిత్యం ప్రయాణీకుల రాకపోకలు పెరిగాయని, అనకాపల్లి కేంద్రంగా రోజుకు పదుల సంఖ్యలో రైళ్లు తిరుగుతున్నాయన్నారు. వీటితోపాటు ఎల్‌టిటి, వందేభారత్ రైళ్లకు అనకాపల్లిలో హాల్ట్ లేకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని, విశాఖ నుండి ముంబాయి వెళ్ళి వచ్చే ఎల్‌టిటికి, విశాఖ నుండి హైదరాబాద్ వెళ్ళి వచ్చే వందేభారత్‌కు అనకాపల్లిలో హాల్ట్ కల్పిస్తే విజయవాడ వెళ్ళే వారికి ఎంతో ప్రయోజనకరంగా వుంటుందన్నారు. అలాగే రైళ్లు, రైల్వే స్టేషన్‌లో మౌళిక వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ట్రైన్లలో టాయిలెట్స్ మరీ అధ్వాన్నంగా వుంటున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు క్లీన్ చేయకపోవడంతో టాయిలెట్స్ దుర్గంధ భరితంగా వుంటున్నాయన్నారు. కావున రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్దరించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విశాఖ నుండి బయలుదేరే ఎల్‌టిటి, వందేభారత్ రైళ్లకు అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, పెంటకోట శ్రీనివాసరావు, తెలయ్య బాబు, నాయణబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: విశాఖపట్నం నుండి విజయవాడ మీదగా వెళ్లే రైళ్లను తక్షణమే పునరుద్దరించి సామాన్యులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. రైల్వే లైన్ల ఆధునీకరణ పనుల పేరుతో పలు రైళ్లు నిలిపియేడం అన్యాయమన్నారు. మంగళవారం పరవాడ సినిమాహాల్ కూడలిలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ పదుల సంఖ్యలో రైళ్లు నిలిపివేస్తే సామాన్యులకు ఇబ్బందులు తప్పవన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు, వలస కార్మికులు ప్రతి రోజు వేలాది మంది ఈ రైళ్లలోనే ప్రయాణిస్తూ ఉంటారన్నారు. వీరికి అందుబాటులో ఉండే రైల్వే సర్వీసులను రద్దు చేయడం వలన తీవ్రమైన ఆర్థిక భారంతో పాటు గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే నిలిపేసిన రైళ్ల సర్వీసులను ప్రారంభించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.తులసి రాజు, కె.నాయుడుబాబు, జి.అప్పారావు, డి.జగన్నాథరావు, పి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అనకాపల్లి
పేజీ :
బుధవారం 26, జూన్, 2024

ఘనంగా ముగిసిన
సిబిసి యోగా చిత్రప్రదర్శన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సిబిసి) నగరంలో యోగా విలేజ్ వద్ద నిర్వహిస్తున్న ఐదు రోజుల చిత్ర ప్రదర్శన మంగళవారం ఘనంగా ముగిసింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను ఎంపీ భరత్ లాంఛనంగా ప్రారంభించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శనలో యోగాసానాలు, యోగ ప్రక్రీయలు, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఎల్ సిడి తెర, వర్చువల్ రీయాలిటీ(విఆర్) వంటి అత్యాధునిక ప్రచార సాధనాలతో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. విశాఖ సాగర తీరంలో ప్రప్రథమంగా ఏర్పాటు చేసిన ఈ యోగా చిత్రప్రదర్శనను తిలకించడానికి బీచ్ సందర్శకులు ఆసక్తిచూపారు. ఈ ప్రదర్శనలో యోగా నిపుణులు యోగాపై శిక్షణిస్తుండడంతో సందర్శకులు, స్థానికులు యోగాసానాలపై మొలకువలు తెలుసుకున్నారు. ఈ చిత్ర ప్రదర్శనలో భాగంగా వివిధ కళాశాలలు, పాఠశాలల్లో యోగాపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రదర్శనలో భాగంగా నగరానికి చెందిన వివిధ కళాబృందాలు ప్రదర్శనలిచ్చాయి. వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులు చిత్రప్రదర్శనను తిలకించడంతో పాటు యోగాలో పాల్గొని మొలకువలు తెలుసుకున్నారు. ఈ చిత్రప్రదర్శనను సిబిసి ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్రచౌదరీ పర్యవేక్షించగా, సిబిసి విజయవాడ డైరెక్టర్ పి.రత్నాకర్ సంచాలకులుగా ఉన్నారు. స్థానికంగా ఈ చిత్రప్రదర్శనను సిబిసి విశాఖపట్నం సహాయ సంచాలకుడు షఫి మహమ్మద్, గుంటూరు ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి రమేష్ చంద్ర, శ్రీకాకుళం ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి తారకప్రసాద్ సహకారం అందించారు.

28న టెక్ మహీంద్రాలో
బీపీఓ ఉద్యోగాలకై జాబ్ మేళా

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక ఉత్తరాంధ్ర జిల్లాలలో గల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో రేసపువానిపాలెంలో గల టెక్ మహేంద్రా సంస్థలో బిపిఓ. ఉద్యోగాల ఎంపిక కొరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఈ నెల 28, 29 తేదీలలో ఉదయం 10 గంటలకు స్థానిక వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా జరుగుతుంది. ఈ జాబ్ మేళాను విశాఖ పట్నం జిల్లా ఉపాధి కార్యాలయం, నోడల్ జవహర్ నాలెడ్జి సెంటరు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. జాబ్ మేళాలో బి.పి.ఓ. రంగములో ఉద్యోగం చేసి స్థిర పడదామనే ఆసక్తిగల యువతీ యువకులు హాజరు కావచ్చును. అభ్యర్థులు డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయినప్పటికీ ఇంగ్లీషు కమ్యూనికేషన్ లో ప్రతిభ గల వారు అర్హులు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నంలోని టెక్ మహీంద్రా సంస్థ నందు పని చేయాలి. టెక్ మహేంద్ర సంస్థ ప్రపంచ స్థాయి కంపెనీ కావున ఈ ఉద్యోగం ద్వారా భవిష్యత్తులో అభ్యర్థులు పొందే నైపుణ్యాల వల్ల ప్రపంచ స్థాయి కంపెనీలలో మంచి జీతంతో ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందడానికి అవకాశం కలుగుతుంది.

మొత్తం ఖాళీలు 328.నమోదు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే ఎంపిక ప్రక్రియలో పాల్గొనుటకు అర్హులు, లేనిచో ఈ ఇంటర్వ్యూలలో పాల్గొనుతకు అవకాశము ఉండదు. అభ్యర్థులు ఆయా జిల్లాలలో గల ఎంప్లాయి మెంటు ఎక్ఛేంజిలలో ఆన్ లైన్‌లో https://employment.ap.gov.in వెబ్ సైటు నందు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

విద్యార్థి దశ నుంచే
నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి
సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సీతామూర్తి

విశాలాంధ్ర - పీఎం పాలెం: విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అవసరమని సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ సీతా మూర్తి పేర్కొన్నారు. రుషికొండ సమీపంలో ఉన్న సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను లీడర్షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వీడన్‌లోని లింకోపింగ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ హెలెన్ ఎల్వ్‌స్ట్రాండ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 2024 అనేది కొత్తగా ఎన్నుకోవడానికి స్టూడెంట్స్ కౌన్సిల్ ను ఏర్పాటు చేసుకోవడం ఒక విశిష్టమైన కార్యక్రమం అని చెప్పుకోవాలన్నారు.ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ నేతృత్వంలో విద్యార్థుల కవతుతో వేడుక ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా 2023-24 ప్రెసిడెంట్,వైస్ ప్రెసిడెంట్ పదవి విరమణ చేశారు.అనంతరం విద్యార్థి మండలి ఆధ్వర్యంలో మాజీ ప్రెసిడెంట్ వీర్, వైస్ ప్రెసిడెంట్ అశ్రిత ప్రసంగాలు, వారి అనుభవాలను విజయాలను పంచుకున్నారు. అతిథులచే కొత్త నాయకులకు బ్యాడ్జింగ్ చేయడం వేడుక యొక్క హైలైట్ గా నిలిచింది. ప్రొఫెసర్ హెలెన్ ఎల్వ్‌స్ట్రాండ్ మాట్లాడుతూ యూరప్ అంతటా ఉపాధ్యాయ విద్యకు ఆమె చేసిన విశేషమైన కృషికి పేరుగాంచిన ఆమె, జీవితకాల అభ్యాసం, బాధ్యతాయుతమైన నాయకత్వం యొక్క ప్రాముఖ్యతపై తన ప్రసంగంతో అసెంబ్లీని ప్రేరేపించింది. సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ సీతా మూర్తి బ్యాడ్జింగ్‌లో పాల్గొని ప్రసంగించారు. సీతా మూర్తి నేతృత్వంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమం కొత్త కౌన్సిల్ బాధ్యతలను అధికారికం చేశారు. నాయకత్వ విలువలను చాటిచెప్పేలా "లీడర్ ఇన్ మి" పాటను ప్రదర్శించారు. ముఖ్యఅతిథి స్ఫూర్తిదాయకమైన ప్రసంగం, అనంతరం కృతజ్ఞతలు తెలిపారు.కొత్త ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ వారి అభిప్రాయాలను పంచుకున్నారు. తల్లిదండ్రులు అభిప్రాయాన్ని అందించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా కొత్త విద్యార్థి నాయకులలో బాధ్యత, గర్వాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రిన్సిపల్ వై.సునీత,ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు,సిబ్బంది పాల్గొన్నారు.

దంతాల సంరక్షణతోనే మంచి ఆరోగ్యం

విశాలాంధ్ర - ఆనందపురం: దంతాలను సంరక్షణగా ఉంచుకుంటేనే మనిషి ఆరోగ్యంగా ఉండవచ్చునని శ్రీదివ్య మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ వైద్యురాలు డాక్టర్ కె.శ్రీదివ్య పేర్కొన్నారు. అనందపురం మండలం వేములవలస, బంటుపల్లి వారి కల్లాలలో రోడ్డులో శ్రీదివ్య మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్‌లో అధునాతమైన ఆర్వీజి ఎక్స్ రే వంటి సౌకర్యం అందు బాటులో ఉన్నట్లు దంత సమస్య ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో దంత సమస్యలకు సరైన చికిత్స అందించి, దంత సమస్యలపై అవగాహన కలిగి కల్పిస్తున్నామన్నారు. రెండు పూటలా బ్రష్ చేసుకోవడం వల్ల పళ్ళను శుభ్రంగా ఉంచుకోవచ్చు అన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంతాలను చెకప్ చేసుకోవాలన్నారు. జింక్ ఫుడ్ స్వీట్స్, చాక్లెట్లు తగ్గించాలన్నారు. దంతాలు పరిశుభ్రంగా లేకపోతే పుప్పల్లు, చిగుళ్ళు నుండి రక్తం, నోటి దుర్వాసన వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఖైని, గుట్కాల ద్వారా క్యాన్సర్ వస్తుందని వీటికి దూరంగా ఉండాలన్నారు. తమ క్లినిక్‌లో రూట్ కెనాల్ ట్రీట్మెంట్, ఇంప్లాట్స్ ఫిక్స్ దంతాల అమర్చుట, పిప్పిపల్లకు ఫిల్లింగ్ చేయుట, చిగుల్ల సమస్యలకు ప్రత్యేక చికిత్స, ఎత్తు, వంకర పళ్ళకు క్లిప్స్ వేయుట, పిల్లలకు ప్రత్యేక చికిత్స, స్మైల్ డిజైనింగ్, పెయిన్ లెస్ టూత్ ఎక్స్‌ట్రాక్సన్, పళ్ళు సెట్ అమర్చుట తదితర సేవలను అందించబడుతున్నాయని పేర్కొన్నారు.